క్లుప్తంగా

ఇంటర్‌లో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్టలోని గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. బైపీసీలో 25 (బీసీ ఏ -1, బీసీ బీ -5, బీసీ సీ -1, బీసీ డీ -2, బీసీ ఈ -1, ఎస్సీ -4, ఎస్టీ -5, ఈడబ్ల్యూఎస్ -5), ఎంఈసీలో (బీసీ ఈ -1, ఎస్సీ3, ఈడబ్ల్యూఎస్ -1) సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఈనెల 6వ తేదీన ఉదయం 10గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 98665 59727 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్పీడీసీఎల్ నయీంనగర్ ఏడీ కిషన్‌కుమార్ బదిలీ

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ నయీంనగర్ ఏడీ పులి కిషన్‌కుమార్‌ను యాజమాన్యం బదిలీ చేసింది. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఏ.గోపాల్ రావు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ఏడీ పీ.మల్లికార్జున్‌కు నయీంనగర్ ఏడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడీ కిషన్‌కుమార్‌పై పలు ఆరోపణలు రావడంతో ఆయనను బదిలీ చేసినట్లు సమాచారం.

బ్రిడ్జిపై ఆటో - కారు ఢీ

స్తంభించిన ట్రాఫిక్



కాజీపేట: కాజీపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడడంతో పాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కాజీపేట నుంచి హనుమకొండ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి వేగంగా ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఆటో, కారు రహదారిపై ఢీకొని ఆగిపోవడంతో బ్రిడ్జికి ఇరువైపులా అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వేధింపుల కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ యువతిని వేధించిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పున్నం చందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఓసిటీకి చెందిన బీటెక్ విద్యార్థినిని సుబేదారికి చెందిన ఓ వ్యక్తి నిత్యం వేధిస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ - కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శనివారం జరిగింది. జీఆర్పీ ఎస్సై ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం 35 - 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గాయత్రినగర్ సమీపంలో అప్‌లైన్‌లో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు 99594 25483, 87126 58585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

శ్రీశివానంద నృత్యమాల విద్యార్థులకు బహుమతులు



హన్మకొండ కల్చరల్: హైదరాబాద్ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా మ్యూజిక్ అండ్ డాన్స్ పోటీల్లో నగరానికి చెందిన సద్గురు శ్రీశివానంద నృత్యమాల నిర్వాహకుడు, నృత్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు పలువురు శిష్యులు కూచిపూడి నృత్య విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. శనివారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

కూచిపూడిలో సహస్రతేజ ప్రతిభ



విద్యారణ్యపురి: హైదరాబాద్‌లో నవ్యనాట సమితి ఆధ్వర్యంలో ఇండియా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌ను తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో ఇటీవల నిర్వహించారు. కూచిపూడి నాట్యంలో సబ్ జూనియర్ విభాగంలో హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పుల సతీష్, అనూష దంపతుల కుమార్తె సహస్రతేజ.. ప్రతిభ కనబరిచి తెలంగాణ నుంచి మొదటి స్థానంలో నిలిచారు. ఈమేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ దీపికారెడ్డి నుంచి సహస్రతేజ మొదటి బహుమతిని అందుకున్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నగర వ్యాప్తంగా ప్రజలు శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్



కేయూ వద్ద నివాళులర్పిస్తున్న పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు



వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్



మడికొండలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



హసన్‌పర్తి: రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న మునిగాల కల్యాణ్

ప్రజలు మరోమారు ఆశీర్వదించాలి

కాజీపేట: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న తనను రానున్న ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించి గెలిపించాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. కాజీపేట మండల కేంద్రంలో రూ.95 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వెలుస్తున్న నూతన కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగుతున్నట్లు వివరించారు. రాంనగర్‌కాలనీలో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, బృందావన కాలనీలో కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఆర్డీఓ రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, తహసీల్దార్ భావ్‌సింగ్, బిషప్ జాన్ మార్కండేయ, మంద శ్రీనివాస్, గుండె కుమార్, బొల్లె కుమార్, రంజిత్ కుమార్, బొక్క రమేష్, మిట్టపల్లి రవీందర్ పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో మాట్లాడుతున్న చీఫ్ విప్

అభివృద్ధి పథంలో పశ్చిమ నియోజకవర్గం

కాజీపేట రూరల్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో వరంగల్ పశ్చిమ నియోజకవరాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నట్లు చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ తెలిపారు. రాంనగర్‌లో రూ.30 లక్షల చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకుముందు బాపూజీనగర్ సెంటర్ నుంచి రాంనగర్ వరకు వాహన ర్యాలీ నిర్వహించారు. కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ సంకు నర్సింగరావు, డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనకరాజు, రంజిత్ పాల్గొన్నారు.

జాబితాను సక్రమంగా తయారు చేయాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కమిషనర్



హసన్‌పర్తి: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న శ్రద్ధశుక్ల

వరంగల్ అర్బన్: తప్పులులేని ఓటరు జాబితాను తయారీ చేసి నివేదించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్, ఈఆర్ఓ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. పోచమ్మమైదాన్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల, ఇస్లామియా స్కూల్, ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ హైస్కూల్‌ను సందర్శించి పరిశీలించారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు తప్పనిసరి

టీఎస్ -బీపాస్ నిబంధనల మేరకు ఎలాంటి డీవియేషన్ లేకుండా భవన నిర్మాణాలను నిర్మించుకోవాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. వరంగల్‌లోని కాశిబుగ్గ, హనుమకొండలోని పలివేల్పుల, కిషన్‌పుర, బాలసముద్రంలో నిర్మించిన భవన నిర్మాణాల ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాల మంజూరు నిమిత్తం కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులతో క్షేత్రస్థాయిలో శనివారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, టీపీఓ సుష్మ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు భీమారంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ట్రైనీ కలెక్టర్ శ్రద్ధశుక్ల శనివారం పరిశీలించారు. అర్హులందరూ తమ పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించారు.

ఘనంగా మడేలయ్య బోనాలు



బోనాలతో వెళ్తున్న ఎమ్మెల్యే రమేష్, మహిళలు

మడికొండ: 64వ డివిజన్ మడికొండలో మడేలయ్య బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, రజక కుల సంఘం కుల సభ్యులు, మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం కుల సంఘం పెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గీత కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం

కాజీపేట రూరల్: కల్లుగీత కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సేఫ్టీ మోకులు తక్షణమే అందించి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోషల్ మీడియా కన్వీనర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఫాతిమానగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో శనివారం జరిగిన గీత కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిలో సుమారు 600 మందికి పైగా గీత కార్మికులు ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి కిందపడగా, వారిలో 200మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. మిగతా వారు శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్నారని చెప్పారు.

5న ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అరూరి గట్టు మల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని 226 ప్రభుత్వ పాఠశాలలు, 30 గురుకుల స్కూళ్లల్లో పనిచేస్తున్న 1,989 మంది ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు వివరించారు. మన బడి - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఆయా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో అభినందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మన బడి - మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు

కరీమాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పెంపకం చేపట్టే వారు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందొచ్చని మామునూరు పశు వైద్య విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్ అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో షెడ్యూలు కులాల ఉప ప్రణాళిక పథకం కింద మహిళా రైతులకు ఐదు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా శనివారం పౌల్ట్రీ హేచరీ యూనిట్ సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పౌల్ట్రీ యూనిట్‌లో వాడే పరికరాలు, వాటి ఉపయోగం గురించి వివరించారు. కోడిగుడ్డు అమర్చినప్పటి నుంచి కోడి పిల్లల ఉత్పత్తి చేసే వరకు పాటించవలసిన నియమాలను మహిళలకు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్ లోథ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీ నుంచి నిర్వహించబోయే సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,445మంది కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ కోచైర్మన్ జరుపుల చందులాల్, కోకన్వీనర్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కల్పన, రమేష్, రాజేష్ రెడ్డి, నందన, రాజన్‌బాబు, సౌజన్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంబరాలు

రామన్నపేట: ప్రభుత్వ ఆర్థిక చేయూతపై చేనేత కళాకారులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు స్వీట్లు పంచి శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి, చేనేత కళాకారులకు రూ.2 వేలు, అనుబంధ కార్మికులకు రూ.వేయి చొప్పున జమచేస్తామని సీఎం కేసీఆర్, చేనేత జౌళిశాఖ మంత్రి కేటీఆర్ గతంలో ప్రకటించి ఇప్పుడు అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా చేనేత కళాకారులు, కార్మికుల కోసం రూ.ఐదు లక్షల జీవిత బీమా సౌకర్యం, రూ.25 వేల ఆరోగ్య బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కొనియాడారు.



సంబరాలు జరుపుకుంటున్న చేనేత కార్మికులు

చిరు వ్యాపారులకు ప్లాట్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్న అర్హులైన చిరు వ్యాపారులకు ప్లాట్లు కేటాయించాలని తెలంగాణ పాడుపు, సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు బిట్ల కృష్ణ కోరారు. ఈమేరకు వరంగల్ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మోడల్ మార్కెట్ ప్రారంభ సమయంలో ప్లాట్ల కేటాయింపుల్లో చిరు వ్యాపారులకు అవకాశం దక్కలేదని పేర్కొన్నారు. వ్యాపారం చేయని వారిని గుర్తించి వారి స్థానంలో వ్యాపారం చేస్తున్న వారికి ప్లాట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కూరగాయల వ్యాపారులు పాపని భాస్కర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన బంధు' ప్రకటించాలి

కాశిబుగ్గ: రాష్ట్రంలోని గిరిజనులకు గిరిజన బంధు పథకాన్ని ప్రకటించి అందజేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలైన మూడు ఎకరాల భూమి, గిరిజన విద్యార్థులకు ఉద్యోగాలు, సాగు చేసే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి లావుడ్యా దసరు, శివరామకృష్ణ, బోడ దేవిక, గుగులోతు పుష్ప, అనూష, లక్ష్మి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సమాఖ్య సభ్యులు

రైల్వే ఇన్‌స్టిట్యూట్ బాయ్ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న రాఘవేందర్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ బాయ్ మొలుగూరి రమేష్ కుటుంబానికి ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ కడిపికొండకు చెందిన మొలుగూరి రమేష్ (39) తాత్కాలిక పద్ధతిలో ఇనిస్టిట్యూట్ బాయ్‌గా 15 ఏళ్ల నుంచి పని చేస్తూ.. కొంతకాలంగా కిడ్నీల సమస్యలతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని చెప్పారు. కుటుంబ పెద్దను కోల్పోయిన మృతుడి కుటుంబాన్ని సికింద్రాబాద్ రైల్వే జీఎం, డీఆర్ఎం అధికారులు ఆదుకోవాలని రాఘవేందర్, రైల్వే నాయకులు, తదితరులు కోరారు. మృతుడు రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ రాజయ్య, ట్రెజరర్ రాజేశ్వర్, కమిటీ సభ్యులు ప్రవీణ్, మాధవరావు, ఇనిస్టిట్యూట్ బాయ్స్ అమర్‌నాథ్, సమద్‌పాషా, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గుడిసెలు కూల్చివేయడం హేయమైన చర్య

వరంగల్: సీపీఎం ఆధ్వర్యంలో వరంగల్ మార్కెట్ రోడ్డులోని చిన్న వడ్డేపల్లి చెరువులో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చేయడం అమానుషం, హేయమైన చర్య అని పార్టీ కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి మహమ్మద్ బషీర్ అహ్మద్ అన్నారు. చిన్న వడ్డేపల్లి చెరువులో తొలగించిన గుడిసెల స్థానంలో శనివారం మళ్లీ గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన 58, 59జీఓ ప్రకారం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఖాళీ స్థలంలో ఇల్లు కట్టించి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం మభ్యపెట్టిందని విమర్శించారు.

వైభవంగా అంజన్న విగ్రహ ప్రతిష్ఠాపన

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ రాంలీల మైదానంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను కనులపండువగా శనివారం నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాలనీవాసులు వేడుకలను నిర్వహించారు. కార్పొరేటర్ ఎలకంటి రాములు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, రామాలయ అధ్యక్షుడు కొండ్రు నర్సింహారావు పాల్గొన్నారు.

ఎంకే జర్నలిస్ట్ ప్లీనరీని విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం (టీఎంకేజేఎఫ్) ద్వితీయ ప్లీనరీని విజయవంతం చేయాలని టీఎంకేజేఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ శంకేసి శంకర్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు ప్లీనరీకి సంబంధించిన కరపత్రాలను ఓసిటీలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ మహబూబ్ కళాశాలలో ప్లీనరీ జరుగనుందని తెలిపారు.

మత్స్య సంఘం డైరెక్టర్‌కు సన్మానం

కరీమాబాద్ / ఖిలా వరంగల్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వరంగల్ జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన బైరి రామేశ్వర్‌ను శనివారం సన్మానించారు. గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన రామేశ్వర్.. కొన్నేళ్లుగా మత్స్యరంగంలో సేవలందిస్తున్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వం సహకార సంఘాలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించగా రామేశ్వర్ జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.

కార్పొరేటర్ కనిపించడం లేదని ఫిర్యాదు

హసన్‌పర్తి: నగరంలోని ఒకటవ డివిజన్ కార్పొరేటర్ అరుణకుమారి కనిపించడం లేదని ఆ డివిజన్‌కు చెందిన కొంతమంది మహిళలు తెలిపారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని ఇన్‌స్పెక్టర్ అబ్బయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా కాలనీల్లో సమస్యలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేటర్‌కు విన్నవించుకోవాలంటే ఆమె అందుబాటులో లేదని ఎద్దేవాచేశారు. ఆత్మ డైరెక్టర్ గనిపాక కల్పన, స్థానికులు కందికట్ల బుజ్జక్క, లక్ష్మి, దామెర పద్మ, మరియ, ఇంద్ర పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీకి ఘన స్వాగతం

హన్మకొండ: నిజాం విముక్త స్వతంత్ర అమృత మహోత్సవాలు, పరకాల హత్యాకాండ జరిగి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పిస్తూ హిందూవాహిని ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి కాజీపేట, హనుమకొండ చౌరస్తాల్లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.

ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేస్తాం..

వరంగల్ చౌరస్తా: వరంగల్ పార్లమెంట్ సభ్యుడిగా తాను, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా తన సతీమణి న్యాయవాది చంద్రకళ పోటీ చేయనున్నట్లు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. వరంగల్ కూరగాయల మార్కెట్‌లో పోలింగ్ కేంద్రంలో తమ ఓటును బదలాయింపు కోసం శనివారం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

పోచమ్మ దేవాలయ కమిటీ ఏర్పాటు

జులైవాడ: హనుమకొండ 49వ డివిజన్ పరిధి రెవెన్యూకాలనీలోని పోచమ్మ దేవాలయం అభివృద్ధి కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాలిగపు దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీరామోజు ప్రవీణ్‌కుమార్ చారి, రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి పావురాల భిక్షపతి, డైరెక్టర్ గుండేటి రవి, మంజుల, కుమారస్వామి, వల్లెపు కుమార్, కేషరావు, ప్రశాంత్, సలహాదారులుగా అర్చనపల్లి విద్యాసాగర్, రమేష్, లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన పలివేల్పులకు చెందిన రాకేష్ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు బాధితులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి రూ.3 వేలు, పోతబోయిన లోకేష్ రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు దేవరకొండ శంకర్, ఖాదర్‌బాబా, అల్వాల రాజా కొమురయ్య, గుమ్మయ్య, శరత్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అందజేయాలి

కాజీపేట అర్బన్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు అందజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య డిమాండ్ చేశారు. 31వ డివిజన్ న్యూశాయంపేట చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శనివారం నిరసన తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న జీడబ్ల్యూఎంసీ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బరుపట్ల మహేష్, బాబు, వేల్పుల సారంగపాణి, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అగ్ని ప్రమాదం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు బొడ్రాయి శివాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన పూజారి.. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వరంగల్ మట్టెవాడ ఫైర్ స్టేషన్ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని ఎగిసి పడుతున్న మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ప్రహరీతోపాటు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆలయ పూజారులు అనంతమూర్తి శర్మ వెలిదే, సునీల్ శర్మ తెలిపారు. భక్తులు వెలిగించిన దీపాల కారణంగానే అగ్నిప్రమాదం సంభవించిందని వారు తెలిపారు.

సినీ హీరో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

మడికొండ: సినీ హీరో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మడికొండలో శనివారం నిర్వహించారు. హనుమకొండ జిల్లా పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పల్లపు మధు ఆధ్వర్యంలో మా ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సిద్దం రాజు శనివారం ప్రారంభించారు. అలాగే, వరంగల్ 33వ డివిజన్ శివనగర్‌లో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి శంకుస్థాపన చేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ శాంతినగర్‌లో స్థానిక కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆహ్వానించారు.

భద్రకాళి దేవాలయంలో ప్రముఖుల పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని తెలంగాణ ఇన్‌కంటాక్స్ కమిషనర్ బత్తుల బాలకృష్ణ, జయశ్రీ దంపతులు, ప్రముఖ సాహితీవేత్త, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అష్టకళ రాంమోహన్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దంపతులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషభారతి, అర్చకులు భద్రకాళి శేషు స్వాగతించి సన్మానించారు. అనంతరం శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం అందజేశారు.



పూజలో పాల్గొన్న బాలకృష్ణ దంపతులు



రాంమోహన్